# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సంఘ సంస్కర్తల వారసత్వాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఆరు రోజుల విదేశీ పర్యటనను ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు.
- పర్యావరణ పరిరక్షణకు, సుస్థిర భవిష్యత్తుకు చెట్లు నాటడం ఆవశ్యకమని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- నిర్మాణ రంగంలో పర్యావరణ అనుకూల సాంకేతికతను అవలంబించాలని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ సంఘ సంస్కర్తల వారసత్వాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీ ద్వారకలోని మన్నం అంతర్జాతీయ కేంద్రంలో సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు మన్నత్తు పద్మనాభన్ విగ్రహాన్ని ఆయన ఈరోజు ఆవిష్కరించి, మన్నం స్మృతి మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, సమాజ సేవ పట్ల మన్నత్తు పద్మనాభన్.. జీవితకాలం నిబద్ధతతో ఉన్నారని అన్నారు. సమ్మిళిత, సామరస్య సమాజ నిర్మాణ దిశగా దేశం సాగిస్తున్న ప్రయాణంలో పద్మనాభన్ ఆదర్శాలు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని చెప్పారు. పద్మనాభన్‌ను ఆధునిక భారతదేశపు గొప్ప సంఘ సంస్కర్తలలో ఒకరిగా అభివర్ణిస్తూ, విద్య, సామాజిక సంస్కరణలు, స్వావలంబన, సమాజ సేవ ద్వారా సమాజ అభ్యున్నతికి ఆయన జీవితం అంకితం చేశారని రాధాకృష్ణన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో 6 రోజుల పర్యటనను ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి తొలుత.. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆహ్వానం మేరకు ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు ఆ దేశంలో పర్యటించారు. అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన ప్రధానమంత్రి.. ఉభయ దేశాల మధ్య భాగస్వామ్యంలో సాధించిన పురోగతిని సమీక్షించారు. తరువాత ఆస్ట్రేలియాలో పర్యటించిన ఆయన.. ఆ దేశ ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్‌లో 3వ భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. అలాగే.. భారత్-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరమ్ లోనూ పాల్గొని, ఇరు దేశాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఆక్లాండ్‌లో పర్యటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణకు, సుస్థిర భవిష్యత్తుకు చెట్లను నాటడం అత్యంత ఆవశ్యకమని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన వృక్ష మిత్ర పర్యావరణ సంరక్షణ సంకల్ప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచమంతా నేడు వాతావరణ మార్పులు, భూతాపం గురించి ఆందోళన చెందుతోందన్నారు. 1880 సంవత్సరం నుండి పెరుగుతున్న సముద్ర ఉష్ణోగ్రతలు, కరుగుతున్న హిమానీనదాల కారణంగా ప్రపంచ సముద్ర మట్టాలు సుమారు 20 నుంచి 23 సెంటీమీటర్ల మేర పెరిగాయని చెప్పారు. 1900 సంవత్సరంతో పోలిస్తే భూమి సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఇది వాతావరణ మార్పులకు ఒక తీవ్రమైన హెచ్చరిక అని అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక కీలక చర్యలు తీసుకున్నారని పేర్కొంటూ.. దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరిగిందన్నారు. 2070 సంవత్సరం నాటికి నికరంగా జీరో కార్బన్ ఉద్గారాలను సాధించాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర మంత్రి చౌహాన్ తెలియజేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నిర్మాణ రంగంలో పర్యావరణ అనుకూల సాంకేతికతను అవలంబించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ CPWD 172వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ, ఏ నిర్మాణాన్ని చేపట్టినా దాని మన్నిక, దృఢత్వం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సంస్థ విశ్వసనీయతను పెంపొందించేందుకు పూర్తి నిజాయితీ, నైతికతలతో పనిచేయాలని CPWD సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నేషనల్ కౌన్సిల్ ఫర్ పబ్లిక్ వర్క్స్ భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి అమిత్ షా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 405 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ప్రారంభించారు. ఏక్ పెడ్ మా కే నామ్ ప్రచారంలో భాగంగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించి, తన లోక్‌సభ నియోజకవర్గమైన గాంధీనగర్ వ్యాప్తంగా 1.25 కోట్లకు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ, 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గంలో పచ్చదనాన్ని 20 శాతానికి పెంచేందుకు ఒక దీర్ఘకాలిక పర్యావరణ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. మర్రి, రావి, జంబు, అర్జున వంటి దేశీయ జాతుల మొక్కలను నాటడం వల్ల నగర ఉష్ణోగ్రతను 5 శాతం తగ్గించవచ్చని, భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన వాతావరణం లభిస్తుందని హోం మంత్రి ఉద్ఘాటించారు. ప్రతి ఇల్లు పర్యావరణ సుస్థిరతకు దోహదపడాలని, సోలార్ రూఫ్ టాప్స్ ను సార్వత్రికంగా అవలంబించాలని అమిత్ షా కోరుతూ...

(వాయిస్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఒమన్ తీరంలో వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఈ ఉదయం జరిగిన దాడిని భారత్ ఖండించింది. నౌకలో ప్రయాణిస్తున్న 11 మంది భారత జాతీయులలో, ఇప్పటివరకు 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతైనట్టు సమాచారం అందిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, గాలింపు, సహాయక చర్యలలో ఒమన్ అధికారులతో సమన్వయం చేసుకుంటోందని పేర్కొంది. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొనేందుకు, ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని భారత్ పునరుద్ఘాటించింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలోని అంతర్జాతీయ జలమార్గాల ద్వారా స్వేచ్ఛాయుత, నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి భారతీయ వ్యాపార ప్రతినిధి బృందం రేపటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు స్పెయిన్, బెల్జియం, ఫిన్లాండ్ దేశాలలో పర్యటించనుంది. వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, ఆవిష్కరణ, సుస్థిరతలపై దృష్టి సారిస్తూ, ఐరోపాతో భారతదేశ ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ

బృందం రేపు స్పెయిన్‌లో ఒక బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో పాల్గొంటుంది. తరువాత ఈ నెల 14, 15 తేదీలలో బెల్జియంలో పర్యటించి, అక్కడ థేల్స్ గ్రూప్, సిలాక్స్ గ్రూప్ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నెల 16, 17 తేదీలలో ఫిన్లాండ్‌లో భారత్-ఫిన్లాండ్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌కు హాజరవుతుంది. టెలికమ్యూనికేషన్స్, అధునాతన తయారీ, స్వచ్ఛ ఇంధనం, మొబిలిటీ, ఆవిష్కరణ రంగాలలో సహకారాన్ని అన్వేషించేందుకు నోకియా, కోన్, కెంపీ గ్రూప్, వీటీటీ రిసెర్చ్ సెంటర్ వంటి ప్రముఖ ఫిన్నిష్ కంపెనీలు, పరిశోధనా సంస్థలను ఈ బృందం సందర్శించనుంది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా రేపు దేశవ్యాప్తంగా సుమారు 668 కోట్ల రూపాయల విలువైన 7 ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ ESI ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. తెలంగాణలో సనత్‌నగర్‌లోని ESIC ఆసుపత్రిలో కొత్త OPD భవనాన్ని ప్రారంభించడానికి డాక్టర్ మాండవియా స్వయంగా అక్కడికి వెళ్తారని, మిగిలిన ఆరు ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

యెమెన్‌కు ప్రయాణించే భారత పౌరులపై కొన్ని షరతులను విధించిన 2017 నాటి నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నట్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) తెలిపింది. యెమెన్‌లో అంతర్యుద్ధం భద్రతా వాతావరణంపై ప్రభావం చూపిన నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ జారీ చేయబడిందని, దీంతో భారతదేశం తన పౌరుల ప్రయాణాలను నియంత్రించడం ప్రారంభించిందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =